# కా॥ కారం పార్వతి 23వ వర్ధంతి సభ



వర్ధంతిసభకు హాజరైన గిరిజన, ప్రజానీకం

**మనుగోపాల, 4-11-2020 :**

1997 నవంబర్ 4న దుష్ట భూస్వామ్య తుపాకీ గుండ్లకు బలైన కామ్రేడ్ కారం పార్వతి 23వ వర్ధంతిసభ నవంబర్ 4, 2020న పోలవరం మండలం మనుగోపాలలో స్ఫూర్తిదాయకంగా జరిగింది. సభకు ముందుగా ప్రదర్శనగా కామ్రేడ్ కారం పార్వతి స్థూపం వద్దకు చేరుకొని ఎర్రెర్రని తోరణాల మధ్య సుత్తి కొడవలి జెండాను రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ ఎగురవేసి, నివాళి అర్పించారు. అక్కడ హాజరైన కార్యకర్తలు, ప్రజలు, నాయకులందరూ స్థూపం వద్ద పూలను వుంచి జోహార్లర్పించారు.

అనంతరం ప్రదర్శనగా మనుగోపాలలోని సభాస్థలానికి చేరుకొని సభ నిర్వహించారు. ఈ సభకు ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥ కుంజం రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా భూముల కోసం పోరాడి, సాధించుకున్న భూముల్ని నిలబెట్టుకోవడం కోసం భూస్వాముల, పెత్తందార్ల కుట్రలను - కుతంత్రాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నామన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ ఈ సభలో మాట్లాడుతూ మన రాష్ట్రంలో గిరిజన పోరాటాలకు గొప్ప చరిత్ర వుందన్నారు. బ్రిటీషువాడి గుండెలకి విల్లు ఎక్కుపెట్టినవాడు అల్లూరి సీతారామరాజు అన్నారు. అధికార మార్పిడి తరువాత శ్రీకాకుళం జిల్లాలో దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాన్ని దెబ్బ తీసేందుకు 1967 అక్టోబర్ 31న కాల్పులు జరిపి కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలను భూస్వాములు పొట్టన పెట్టుకున్నారన్నారు.

తూర్పుగోదావరిజిల్లా కొండమొదలులో పోరాడుతున్న గిరిజనులపై 1982 నవంబర్ 29న పోలీసులు తుపాకీ గుండ్లను పేల్చి కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యలను బలిగొన్నారని, పశ్చిమ గోదావరిజిల్లాలో 1997 నవంబర్ 4న భూమికోసం పోరాడుతున్న గిరిజనులపై భూస్వామి తుపాకీ గుండ్లకు కామ్రేడ్ కారం పార్వతి అమరులయ్యారన్నారు. విజయనగరం జిల్లా దుగ్గేరులో 1997 నవంబర్ 17న భూస్వాముల, పెత్తందార్ల మూకుమ్మడి దాడిలో కా॥ జెన్ని తిరుపతి అమరుడయ్యాడన్నారు. ఎన్ని దాడులు చేసినా, కేసుల్లో నిర్బంధించినా మన సంఘం నాయకత్వంలో గిరిజనులు పోరాడుతున్నారన్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలో షావుకార్లు, సొండీలు, సారా వ్యాపారస్తులకు వ్యతిరేకంగా ఛాషీ మూలియా ఆదివాసీ సంఘం నాయకత్వంలో పోరాటానికి నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్ కేంద్రుక అర్జున్‌ను మావోయిస్టు పార్టీ హంతక దళం హతమార్చి దోపిడీవర్గాలకు మేలు చేసారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా 1/70 చట్టాన్ని అమలు చేయకుండా భూస్వాములకి, పెత్తందార్లకే వత్తాసు పలుకుతున్నాయని, గిరిజన అమరవీరుల స్ఫూర్తిగా మరింత సంఘటితంగా పోరాటాలకు సంసిద్ధం కావాలని అన్నారు.

పోలవరం ప్రాజెక్టు పేరుతో లక్షలాదిమంది గిరిజనుల జీవితాలను సమాధి చేయాలని తలచిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కోసం పోరాడుతున్నామని గిరిజనుల భూములకు భూస్వాములకు నష్ట పరిహారం ఇప్పించి గిరిజనులకు మోసం చేస్తున్నారని అన్నారు. కొండమొదలులో 40 సంవత్సరాలుగా భూములు సాగు చేస్తుంటే, భూమికి భూమి ఇవ్వకుండా చేస్తుంటే మన నిలకడైన పోరాటం ఫలితంగా ప్రభుత్వాధికారులకి - సంఘ నాయకత్వానికి మధ్య 420 ఎకరాల భూమిని గిరిజనులకు ఇస్తామని ఒప్పందం జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్నా భూములు ఇవ్వలేదన్నారు. ఈ నేపధ్యంలో అమరుల స్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు సాగించటమే మన ముందున్న కర్తవ్యంగా పిలుపునిచ్చారు.

ఈ సభలో ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ ఎం.ఎస్. నాగరాజు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥ చెదల వీరపరెడ్డి, కా॥ సవలం రాంబాబులు మాట్లాడారు.

సభ ప్రారంభంలో సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కార్యదర్శివర్గసభ్యులు; 'జనశక్తి', 'క్లాస్‌స్ట్రగుల్' పత్రికల సంపాదకులు కా॥ పి. జశ్వంతరావు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ సున్నం రాజు, మడకం బుచ్చయ్య, కరకం కనకయ్యలకు 2 ని॥లు మౌనం పాటించి జోహార్లు చెప్పారు.

★ ★ ★